# విభ్రాంతి

- వీరభద్రరావ్ పమ్మి



హైద్రాబాద్‌లో రిక్షా తొక్కుకుని బతికేవాడికి ఇరానీ హోటల్ కెళ్ళి బన్ తిని, టీ తాగే స్టేటస్ వుంటుంది. అంతే అతనా హోటల్‌కి ఏ మాత్రం బెదురు ఉండాలి, లేకుండా వెళ్ళగలడు. ఓ రోజున అతనెక్కువ సంపాదించ వచ్చు. ఆ డబ్బుతో మరి కాస్త

ఖరీదైన హోటల్‌కెళ్ళి ఉత్తప్పం, దోసెతిని బ్రూ కాఫీ తాగే స్తోమత ఉండవచ్చు. కాని, అతనా ఖరీదైన హోటల్లోకి బెదురు, బెరుకు లేకుండా ధైర్యంగా వెళ్ళలేడు. ఏదో ఒకటి కాళ్ళకు అడ్డం పడు తుంది. నిస్సత్తువ ఆవహిస్తుంది. పీటిని భేదించి ఆ హోటల్‌కి వెళ్ళినా, మొహంలో ఏదో భయం, రాకూడని చోటుకి వచ్చానన్న నిస్సత్తువ కనబడుతూనే ఉంటాయి.

నేను మధ్యతరగతిలో పై వర్గం వాణ్ణి. మంచి ఉద్యోగంలోనే ఉన్నాను. నేను అశోకా, అన్న పూర్ణ, సిద్ధార్థ లాంటి హోటళ్ళకి ధైర్యంగా సాహసంగా స్వంత ఇంట్లోకి వెళ్ళినట్టు వెళ్ళగల్ను. ఓ సారి నా మిత్రుడు జెయిసీస్ మీటింగుందని తనతో 'రిట్జ్' హోటల్‌కి తీసికెళ్ళాడు. అతనా క్లబ్‌లో సభ్యుడు. నేనా రోజు రిట్జ్ హోటల్‌కి వెళ్ళడానికి నా ఆర్థిక పరిస్థితి గురించి ఆలోచించ వక్కర్లేదు. డిన్నర్ క్లబ్‌వారిది. నేను నా మిత్రుడికి అతిధిని. అయినా హోటల్లోకి అడుగు పెట్టే సరికి ఏదో నిస్సత్తువ నన్నావ హించుకుంది.

కాన్ఫరెన్స్ హోటలో కెళ్ళి కాస్త మనసు కుదుట పరచుకుని కూర్చోడానికి నాక్కాస్త టైం పట్టింది. (మనసు కుదుటపర్చు కున్నానా అన్నది నాకిప్పటికీ అనుమానమే!)

రోజూ నిర్భయంగా రిట్జ్‌కి వెళ్ళే వాళ్ళు—ఢిల్లీలో అశోకాకు వెళ్ళినా, రోజూ ఢిల్లీ అశోకాకు వెళ్ళేవాళ్ళు - లండన్లోని హైడ్ పార్క్ హోటల్‌కెళ్ళినా అలాగే భయంగా, బెదురుగా ఫీలవుతారని నేనో థియరీ ఏర్పాటు చేసు కున్నాను.

అంటే తన తరగతికి పైన వున్నదీ, తన మామూలు ఆర్థిక పరిస్థితికి మించినదీ - అనుభవించ డానికి ప్రతిమనిషి కొంత ఇబ్బంది ఫీలవుతాడని నాకనిపిస్తుంది.

ఎందువల్ల అన్నది నాకే సరిగా తెలియదు. అదో మిస్టరీ....

నేను ప్రతిరోజూ రాత్రిళ్ళు లకిడీకాపూల్‌లోని అశోకాలో భోంచేస్తాను. నాకా హోటలంటే ఇష్టం. అక్కడి సమశీతోష్ణ వాతావరణమంటే ఇష్టం. అక్కడి తెలుగు వచ్చేళ్ళంటే ఇష్టం.

అసలక్కడ భోంచెయ్యడం ఇష్టం.

పగలు ఆఫీసు హడావుడి మూలంగా అంతదూరం వెళ్ళడం కుదరదు. దగ్గర్లో ఏదో హోటల్లో భోంచేసాననిపిస్తాను. రాత్రిళ్ళు తప్పనిసరిగా అశోకాకి వెడతాను. ఆదివారం శెలవు కాబట్టి, రెండు పూటలూ అక్కడికే భోజనానికి వెడతాను.

ఆవేళ ఆదివారం....

మధ్యాహ్నం అశోకాకి వెళ్ళి, నాకిష్టమైన టేబుల్ దగ్గర కూర్చున్నాను. సర్వర్ నన్ను చూడగానే అడక్కుండానే భోజనం తేవడానికి వెళ్ళాడు. అదే టేబుల్ దగ్గర నా ఎదురుగా అప్పటికే మరో ఇద్దరు కూర్చుని ఉన్నారు.

వాళ్ళిద్దర్నీ అంతక్రితం అదే హోటల్లోనే చాలాసార్లు చూశాను. లకిడీకాపూల్ సెంటర్లో కూడా వాళ్ళని చాలాసార్లు చూశాను. వాళ్ళ పేర్లేమిటో, వాళ్ళేం చేస్తారో కూడా నాకు తెలియదు. నేనెప్పుడూ కనుక్కోలేదు. అందులో ఒకతను కాస్త లావుగా, ఎర్రగా ఉంటాడు. ఎప్పుడూ సూట్ వేసుకుకి నీట్‌గా, నాగరికంగా ఉంటాడు.

రెండో అతను చామనఛాయ రంగులో సన్నగా పొడుగ్గా ఉంటాడు. ఎప్పుడూ తెల్లటి పైజామా, లాల్చీ వేసుకుంటాడు. చేతికున్న గోల్డ్ కలర్ రిస్టువాచీ, వేళ్ళకున్న ఉంగరాలు చూస్తే అతను వ్యాపారస్థుడిలా ఉంటాడు. వాళ్ళిద్దరూ స్నేహితులైనా అయి లేదా ఒకరితో ఒకరికి అవసరం వున్న అధికారి—వ్యాపారి అయినా అయి వుండాలి.

ఇద్దర్నీ చూస్తుంటే నాకు లారెల్, హార్డీ సినిమాలు జ్ఞాపకం వస్తాయి.

నేను భోజనం చేస్తున్నాను. వాళ్ళకీ భోజనాలు వచ్చాయి. కోటు మనిషి, లాల్చీమనిషి కాస్త దూరంలో వున్న టేబుల్ వైపు చూపించి, ఏదో చెప్తున్నాడు. అతను చెప్పింది నాకు వినబడ లేదు. నేను కూడా అదే టేబుల్ వైపు చూశాను.

అక్కడ ఓ దంపతులు కూర్చుని ఉన్నారు. అతను చదువుకోని వాడిలా, వ్యవసాయమో, కూలిపనో చేసుకునే వాడిలా ఉన్నాడు. ఉతికిన తెల్లపంచె కట్టుకుని, తెల్లటి ముడతలు పడ్డచొక్కా తొడుక్కున్నాడు. కాయకష్టం చెయ్యడంవల్ల ననుకుంటాను- కండలు తిరిగి, పుష్టిగా ఆరోగ్యంగా ఉన్నాడు. నల్లగా ఉన్నాడు.

అతని పక్కనున్న భార్య చౌక రకం సిల్కు చీర కట్టుకుంది. ఆమె కూడా కాయకష్టం చేసే మనిషిలా ఉంది. నల్లగా ఉన్నా, ముఖం కళగా వుంది.

వాళ్ళు ఏదో పల్లెటూర్నుంచి హైద్రాబాద్ చూడ్డానికి వచ్చుంటారు. అందులో భాగంగా మంచి హోటల్లో భోజనం చెయ్యాలని పించి ఇక్కడికి వచ్చుంటారు.

నేను మొదట్లో చెప్పినట్టు— పై అంతస్థు తాలూకు అనుభవం కోసం వచ్చిన వాళ్ళలా వాళ్ళు బెదురుగా, భయంగా, బెరుకుగా ఉన్నారు. ఏదో తప్పు పని చేస్తున్నట్టు, రాకూడని చోటుకి వచ్చినట్టు, అలా వచ్చినందుకు ఎవరేనా శిక్షిస్తారేమోనన్నట్టు ఆత్రంగా ఉన్నారు.

భయం భయంగా చుట్టు పక్కల వాళ్ళని చూస్తున్నారు.

'ఫీల్ ఎట్ హోమ్' అని వాళ్ళకెవరూ చెప్పలేదు.

నేను భోజనం చేస్తూ కోటు మనిషికేసి చూస్తున్నాను. కోటు మనిషి పల్లెటూరు దంపతుల కేసి చూస్తూ విరసనగా మాట్లాడుతున్నాడు. నేనప్పుడప్పుడు పక్కకి తిరిగి దంపతులకేసి చూస్తున్నాను.

కవంంలో_అన్నం, కూరలు, గిన్నెల్లో-సాంబారు, రసం, పెరుగు మజ్జిగ. ఎదురుగా పచ్చళ్ళు... ఇవన్నీ చూసేసరికి ఆ దంపతులకి కొంత ఆశ్చర్యంగానూ, మరి కొంచెం కంగారుగానూ ఉంది. టేబుల్‌మీద భోజనం చెయ్యడం అలవాటులేక కొంత ఇబ్బంది పడుతున్నారు.

మధ్యలో భయంగా అటు ఇటు చూస్తున్నారు. 'ఎరక్కపోయి ఇక్కడికొచ్చాం' అన్నట్టున్నాయి వాళ్ళ చూపులు.

వాళ్ళిద్దరిలో ఆమె మరీ భయ పడుతున్నట్టుంది.

వధ్యశిల దగ్గరకొచ్చిన మేక పిల్లలా వుంది.

ఆ కంగారులో, భయంలో ఆమె సాంబారు తీసుకోబోతూ గిన్నె వదిలేసింది. ఆ గిన్నె టేబుల్‌మీద పడి దొర్లుకుంటూ వెళ్ళి ఆమె ఒళ్ళో పడింది. చీరంతా సాంబారు ఒలికిపోయింది. ఆ గిన్నెను పట్టుకోడానికి ప్రయత్నించిన అతని చెయ్యి మంచినీళ్ళ గ్లాసుకి తగిలి నీళ్ళన్నీ ఒలికిపోయాయి.

ఆమె తెలియక పొరపాటున హత్య చేసిందానిలా 'గిల్టీ'గా చూస్తోంది.

(మిగతా కథ 79 వ పేజీలో)

అతని చూపులు ఎమిలిజిటిక్‌గా వున్నాయి.

మేమంతా అటువైపు చూశాం.

కోటు పెద్ద మనిషి అసహనంగా ముఖం పెట్టి— "విలేజ్ బ్రూట్స్... వళ్ళు పొగరు కాకపోతే, వాళ్ళకీ హోటలెందుకు చెప్పండి. బడుగు వర్గాలు! గాడిద గుడ్డూ అన్చెప్పి వీళ్ళని మనమీదకి తోల్తున్నారు. ఈ ఖర్చు పెడితే వెధవలకి వారం రోజులు గడుస్తుంది" అన్నాడు.

ఆ మాటలకి లాల్చీ మనిషి పకపక నవ్వాడు.

వీళ్ళేం మాట్లాడుకుంటున్నారో ఎందుకు నవ్వుతున్నారో తెలియని ఆమె, తనని చూసే నవ్వుతున్నారని సిగ్గుతో, అవమానంతో, భయంతో ముంచించుకు పోయింది. వీలైతే భూమిలోకి కుంగిపోయేదానిలా తల వంచేసుకుంది.

సర్వర్ వచ్చి, "అదిగో అక్కడ వాష్‌బేసిన్ వుంది. వెళ్ళండి!" అన్నాడు ఛీదరింపుగా. ఇంగ్లీషు వస్తేగాని—అక్కడో తలుపు వుందని, అది తెరిస్తే వాష్‌బేసిన్ వుంటుందని ఎవరికీ అర్థంకాదు.

"అక్కడికెళ్ళి కడుక్కోండి! హోటలంతా ఖరాబ్ చెయ్యకండి" అన్నాడు సర్వర్ తలుపు తెరిచి వాష్‌బేసిన్ చూపిస్తూ.

అతని దృష్టిలో వాళ్ళు హీనులు.

వాళ్ళు తిరిగొచ్చి ఇహ భోజనం చెయ్యలేనంత బాధ. అవమానంతో, హడావుడిగా బిల్లు చెల్లించి బైట పడ్డారు.

నాకు వాళ్ళమీద జాలి కలిగింది. పాపం! కొంతమందికి చిన్న చిన్న సరదాలు కూడా తీరవు.

కోటు మనిషి వ్యాఖ్య నాకు బాధ కలిగించింది. తను నాగరికుడైనంత మాత్రాన వాళ్ళని బ్రూట్స్ అనక్కర్లేదు.

జీవితంలో అవకాశాలు వస్తే కొంతమంది అలా ఉంటారు. రాక వాళ్ళూ ఇతనికన్నా నాగరికంగా ఉండేవాళ్ళేమో!

అప్పట్నుంచి నాకు కోటు మనిషి గుర్తుండిపోయాడు.

* * *

కొన్నాళ్ళ తర్వాత....

ఫస్ట్‌షో సినిమా చూసి నేను అశోకాకి భోజనానికి వెళ్ళాను. నేను వెళ్ళిన కాసేపటికి కోటు మనిషి వచ్చి నా వెనకాల టేబుల్ దగ్గర కూర్చున్నారు. మనిషి తాగి ఉన్నాడని అతని నడక చెప్తోంది.

"బేరర్!" గట్టిగా అరిచాడు. తను ఇంకా బార్‌లో ఉన్నానను కుంటున్నాడనుకుంటాను. అతని అరుపుకి హోటల్లోని జనమంతా అతనికేసి చూశారు.

"మీల్స్ పట్టుకురా! అరిజెంట్!" అన్నాడు.

కాస్సేపున్నాక సర్వర్ మీల్స్ పట్టుకొచ్చి టేబుల్‌మీద సర్దుతున్నాడు.

"ఇంత లేటేమిటిరా— స్కౌండ్రల్!" అన్నాడు కోటు మనిషి.

"ఇదిగో—ఇంగ్లీషు వచ్చు కదాని ఆస్ పీస్ అంటే కుదరదు. నేనూ చదువుకున్న వాడినే! కాలం, ఖర్మం కల్సిరాక ఈ పని చేస్తున్నాను. చూడండి....తిట్లు నాకూ వచ్చు" అన్నాడు సర్వర్.

"ఐతే తిడతావురా స్టుపిడ్!" అని సర్వర్ ముఖంలో ముఖం పెట్టి అన్నాడు.

"ఆఁ-తిడతాను.. అన్ని భాషల్లో తిట్టగల్ను. నువ్వే స్టుపిడ్! వెధవ్వి! డాంకీవి...."

సర్వర్ తిట్లు పూర్తి కాకుండానే కోటు మనిషి లేచి అతని కాలర్ పట్టుకున్నాడు. కొట్టడానికి చెయ్యి ఎత్తాడు.

"వెళ్ళవయ్యా! నీలాంటి వాళ్ళని చాలా మందిని చూశాను!" అని సర్వర్ కోటు మనిషిని ఒక్క గెంటు గెంటాడు.

ఆ ఊపుకి కోటుమనిషి ముందు టేబుల్‌మీదపడి, కంచం గిన్నెలతో సహా కుర్చీమీద పడి, కుర్చీతో సహా కింద కుప్పలా పడ్డాడు.

అతని ఒళ్ళంతా, బట్టలంతా. సాంబారు, రసం, పెరుగ పచ్చళ్ళు....

ఆ స్థితిలో అతను చాలా అసహ్యంగా ఉన్నాడు.

బ్రూట్ ఎవరో నా కర్థమైంది... *

**Edited & Published by VIJAYA BAPINEEDU**
**80, Dhanalaxmi Colony, Madras-600 026, and**
**Printed by him at Vijaya Graphics;**
**210-Arcot Road, Madras-600 026. Phone: 422233**